క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

రొంపిచర్ల: మండలంలో మర్రిచెట్టుపాలెం, బుచ్చిబాపన్నపాలెం, రొంపిచర్ల, సుబ్బయ్యపాలెం విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో గల గ్రామాలలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు మండల విద్యుత్ శాఖ ఏఈ కె.రాంబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పిడుగురాళ్లలోగల 220/132/33 కె.వి. విద్యుత్ స్టేషన్‌లో అత్యవసర మరమ్మతుల నిమిత్తం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయటం జరుగుతుందన్నారు. అదే విధంగా త్రీఫేస్ వినియోగదారులకు తెల్లవారు జామున 12 గంటల నుంచి ఉదయం 9 గంటల వరకు విద్యుత్ సరఫరా ఇవ్వటం జరుగుతుందన్నారు. అనంతరం విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందన్నారు.

నేడు ఉచిత మెగా వైద్యశిబిరం

వినుకొండ(నూజెండ్ల): రోటరీ క్లబ్ గ్రేటర్ వినుకొండ ఆధ్వర్యంలో కాటూరి మెడికల్ కాలేజీ అండ్ హాస్పిటల్ వారిచే ఈ నెల 28వ తేదీ శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు పట్టణంలోని గోగినేని కల్యాణ మండపంలో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు క్లబ్ సభ్యులు తెలిపారు. ఈ వైద్యశిబిరంలో షుగర్, హిమోగ్లోబిన్, కొలెస్ట్రాల్, మూత్రపిండాలు, లివర్, గుండె పరీక్షలు ఉచితంగా చేసి అవసరమైన వారికి మందులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ మేరకు వైద్యశిబిరం కరపత్రాలను క్లబ్ సభ్యులు ఆవిష్కరించారు.

సుబ్బారెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన మాజీ మంత్రి



రొంపిచర్ల : మండల కేంద్రమైన రొంపిచర్లలో శుక్రవారం మాజీ మంత్రి కాసు వెంకట కృష్ణారెడ్డి పర్యటించారు. గ్రామంలో రెండు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందిన వ్యవసాయ మార్కెట్ యార్డ్ మాజీ ఛైర్మన్ గెల్లి సుబ్బారెడ్డి గృహానికి వెళ్లి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. సుబ్బారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఛైర్మన్‌గా, ఎంపీటీసీ మెంబర్‌గా, పూర్వపు కాంగ్రెస్ నాయకుడిగా, రైతులకు, గ్రామాభివృద్ధికి చేసిన సేవలను కొనియాడారు. సుబ్బారెడ్డికి తనతో ఉన్న అనుబంధాన్ని గుర్తుకు తెచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచులు గెల్లి చిన కోటిరెడ్డి, పడాల చక్రారెడ్డి, మండల నాయకులు అన్నెం పున్నారెడ్డి, పిచ్చిరెడ్డి, రామిరెడ్డి, గెల్లి కోటిరెడ్డి, పాల్గొన్నారు.

పంటబీమా, మద్దతు ధరకు ఈ-క్రాప్ తప్పనిసరి

జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ శివకుమారి

యడ్లపాడు: ఈ ఏడాది ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలు ఈ-క్రాప్‌లో నమోదైతేనే ఆయా పంట ఉత్పత్తులకు ప్రభుత్వ మద్దతు ధర..పంటబీమా వంటివి వర్తిస్తాయని జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ శివకుమారి చెప్పారు. ఈ-క్రాప్ నమోదుపై సామాజిక తనిఖీల్లో భాగంగా మండలంలోని తిమ్మాపురంలో శుక్రవారం వ్యవసాయ అధికారులు గ్రామసభను ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఏవో సీహెచ్ సరిత ప్రత్తి, మిరప పంటలకు వర్షాభావ పరిస్థితుల్ని నుంచి కాపాడుకునే విషయాలపై వివరించారు. ముందుగా గ్రామంలోని ప్రత్తి, మిరప పొలాల్ని రైతులతో కలిసి సందర్శించారు. అనంతరం సబ్సీడీపై ఎరువుల్ని అందజేశారు.

పోలీసులకు అనుమానితుల అప్పగింత

వినుకొండ(నూజెండ్ల): గేదెలను అపహరించేందుకు గుర్తుతెలియని వ్యక్తులు సంచరిస్తుండటంతో నూజెండ్ల మండలం త్రిపురాపురం గ్రామస్తులు ఇరువురు వ్యక్తులను పట్టుకొని పోలీసులకు అప్పగించారు. తరచూ గేదెలు కనిపించకుండా పోవడంతో అనుమానంగా తిరుగుతున్న వారిని ప్రశ్నించగా పొంతన లేని సమాధానం చెప్పడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. వినుకొండ రూరల్ సీఐ సుధాకర్ ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు.

పాలస్తీనా ప్రజలకు అండగా ఉండాలి

నరసరావుపేట: భారతదేశం పాలస్తీనా ప్రజలకు అండగా ఉండాలని, ఇజ్రాయిల్ దాడులు నిలిపివేయాలని, పాలస్తీనా న్యాయమైన పోరాటానికి మద్దతు ఇవ్వాలని రౌండ్ టేబుల్ సమావేశం తీర్మానించింది. శుక్రవారం ఎన్జీవో హోంలో దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం(పీడీఎం) జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ అధ్యక్షతన ప్రజా సంఘాల నాయకులు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. రాష్ట్ర నాయకులు వై.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పాలస్తీనాపై ఇజ్రాయిల్ చేస్తున్న దాడులు అత్యంత పాశవికంగా ఉన్నాయన్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నల్లపాటి రామారావు, పీడియం జిల్లా అధ్యక్షులు షేక్ మస్తాన్‌వలి, ఎంసీపీయు జిల్లా కార్యదర్శి రెడ్ బాషా, సీఐటీయూ నాయకులు షేక్ సిలార్, ఎంఐఎం పార్టీ పట్టణ కార్యదర్శి షేక్ దరియా వలి, ఏపీ గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కోటానాయక్, పౌర హక్కుల సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సికినం చిన్న, బీసీ నాయకులు బాగున్నల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ హయాంలోనే మెరుగైన సేవలు

- ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు
- ఇనిమెళ్లలో గోడౌన్‌ను ప్రారంభించిన ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు



గోడౌన్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

ఈపూరు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రాష్ట్రంలోని రైతులకు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మెరుగైన సేవలను అందిస్తున్నారని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. మండలంలోని ఇనిమెళ్ల గ్రామంలో ఈపూరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం వారి సహకారంతో నూతనంగా నిర్మించిన గోడౌన్‌ను నరసరావుపేట పార్లమెంటు సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలుతో కలిసి ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుమారు రూ.40 లక్షల వ్యయంతో 500 మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల బహుళ ప్రయోజన సౌకర్యంతో ఈ గోడౌన్‌ను నిర్మించడం జరిగిందన్నారు. రైతు సోదరులకు ఎంతో అవసరమైన గోదామును ప్రారంభించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఎలాంటి ఎరువులైనా, పురుగుమందులైనా ప్రభుత్వం ద్వారా తక్కువ ధరకు రైతులకు అందజేయడం జరుగుతుందన్నారు. అనంతరం రైతులకు రాయితీపై ప్రభుత్వం అందిస్తున్న మంచి శనగలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఈపూరు మార్కెట్ యార్డు ఛైర్మన్ చుండూరి వెంకటేశ్వర్లు, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ కోపెల దేవరాజ్, శాకమూరి బుచ్చయ్య, హనుమయ్య, సొసైటీ ఛైర్మన్ బొల్లా బుజ్జి, అబ్బులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించే వారే ప్రజాప్రతినిధి

ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ(నూజెండ్ల): ప్రజల అవసరాలు తెలుసుకొని పరిష్కరించే వారే నిజమైన ప్రజాప్రతినిధి అని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. వినుకొండ పట్టణంలోని ఓబయ్యకాలనీ సచివాలయం పరిధిలోని 24వ వార్డు పెద్దమసీదు బజారు నుంచి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మె ల్యే ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను తెలియజేశారు. అనంతరం వార్డు ప్రజలనుద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇంటింటికీ తిరుగుతున్నప్పుడు ప్రజలు తమకు ప్రభుత్వం అందించిన పథకాలు తెలియజేస్తూ సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. వినుకొండ అభివృద్ధి గత ప్రభుత్వంతో పోల్చి చూసుకోవాలని అన్నారు. గత పదేళ్లలో వినుకొండ వెనుకబడిన ప్రాంతంగానే ఉందని, కనీసం తాగునీరు అందించలేని స్థితిలో తాగునీటి సమస్యను అడ్డంపెట్టుకొని ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసి కోట్ల రూపాయలు టీడీపీ పెద్దలు దండుకున్నారన్నారు.

తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వినుకొండకు శాశ్వతంగా తాగునీటి సమస్యను పరిష్కరించినట్లు చెప్పారు. మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు మారు వేషాల్లో మాస్కులు ధరించి ప్రజల్లో స్పందన కోసం తిరుగుతుంటే ప్రజలు ఇష్టానుసారంగా ప్రజాప్రతినిధులను తిడుతున్నారని అన్నారు. ఇలాంటి కొత్త సంస్కృతికి తెరలేపి రాజకీయంగా చులకన చేస్తున్నారని విమర్శించారు.

తాము అధికారంలోకి వచ్చిన తరువాత మున్సిపల్ కాంప్లెక్సులు, ఎన్ఎస్‌పీ కెనాల్‌పై సీసీ రోడ్లు, ఘాట్ రోడ్డు నిర్మాణం, గిరిప్రదక్షిణం రోడ్డుతో పాటు అనేక అభివృద్ధి పనులు చేపట్టామని చెప్పారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత లక్షల కోట్ల రూపాయలు సంక్షేమానికి ఖర్చు చేయడమే కాకుండా నవరత్నాల పేరుతో అన్నివర్గాలను ఆదుకున్నట్లు చెప్పారు. వినుకొండలో ముస్లిం మైనార్టీలకు కళాశాల, షాదీఖానాకు త్వరలో శంకుస్థాపన చేస్తామన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు పీఎస్ ఖాన్, వార్డు కౌన్సిలర్ కాంట్రాక్ట్ గౌస్ బాషా, వైస్ ఛైర్మన్ బేతం గాబ్రియేలు, కౌన్సిలర్లు షకీలా దస్తగిరి, నంది నరసింహారావు, మున్సిపల్ కమిషనర్ వెంకయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

బుక్కాపురం సర్పంచ్‌గా అల్లడి

నాదెండ్ల: మండలంలోని బుక్కాపురం గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా అల్లడి రవికుమార్ తిరిగి విధుల్లో చేరారు. సాధారణ ఎన్నికల్లో వైసీపీ మద్దతుతో గెలుపొందారు. వ్యక్తిగత కారణాలతో ఈ ఏడాది ఏప్రియల్ 13న ఆరునెలలపాటు సెలవు పెట్టారు. ఆరు నెలల గడువు పూర్తి కావటంతో శుక్రవారం ఎంపీడీవో షేక్ జాకీర్ హుస్సేన్‌ను కలిసి తాను విధుల్లో చేరుతున్నట్లు పత్రం అందించారు.

స్వామిత్ర ద్వారా గ్రామాల్లో కొలతలు

శావల్యాపురం: స్వామిత్ర కార్యక్రమంలో భాగంగా మండలంలో పిచికలపాలెం, ముండ్రువారిపాలెం, గుంటుపాలెం, వయ్యకల్లు మొదట విడతలో ఎంపికైనట్లు ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య శుక్రవారం తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో మాట్లాడుతూ ఇందుకుగాను ఆయా గ్రామపంచాయతీలు వారిగా వోఆర్ఎస్ ఛాయచిత్రాలను ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. ఈనెల 31న రోవర్ యంత్ర పరికరం ద్వారా రెవెన్యూ, పంచాయతీ అధికారుల పర్యవేక్షణలో అన్నీ నివాస గృహాలు గ్రామకంఠాలు, ప్రభుత్వ భూములు రహదారులు కొలతలు తీసే కార్యక్రమం ప్రారంభం అవుతుందన్నారు. ఆయనతో పాటు ఈవోపీఆర్డీ పి.సుగుణ ఉన్నారు.

పంట నమోదు వివరాలను సరిచూసుకోవాలి

బొల్లాపల్లి: మండలంలోని సచివాలయం, రైతు భరోసా కేంద్రాల్లో పంట నమోదు వివరాలు జాబితా ప్రచురించామని వ్యవసాయ అధికారి ఎ. అంకారావు తెలిపారు. మండలంలోని మేళ్ళవాగు గ్రామ ఆర్‌బీకెల్లో రైతులతో సమావేశం నిర్వహించారు. ఆయా గ్రామ సచివాలయల పరిధిలోని రైతు భరోసా కేంద్రాల్లో ఖరీఫ్ పంట నమోదు వివరాల జాబితాలను ఉంచామని, రైతులు పరిశీలించి సరిచూసుకోవాలని తెలిపారు. జాబితాల్లో అభ్యంతరాలు ఉంటే రైతు భరోసా కేంద్రాల్లోనే వ్యవసాయ సహాయకులకు తెలియపరచాలని సూచించారు. పంట నమోదుకు సంబంధించి రైతులు పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. మండలంలో 18 వేల ఎకరాల్లో పంట నమోదు చేయడం జరిగిందని, దీనిలో 17200 ఎకరాలకు సంబంధించి ఈకెవైసీ పూర్తి చేశామని వివరించారు. కార్యక్రమంలో ఏఈవో ఆర్. మల్లికార్జునరావు, వ్యవసాయ సహాయకులు రవీంద్ర, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పెద్ద నగరాలకు దీటుగా వైద్యసేవలు

రవీంద్ర గ్యాస్ట్రో అండ్ లివర్‌కేర్ హాస్పిటల్ అధినేత డాక్టర్ కంఠంనేని



మాట్లాడుతున్న డాక్టర్ రవీంద్ర

నరసరావుపేట: విజయవాడ, హైదరాబాద్ లాంటి నగరాలకు దీటుగా రవీంద్ర గ్యాస్ట్రో అండ్ లివర్‌కేర్ హాస్పిటల్‌లో వైద్యసేవలు అందజేస్తున్నామని డాక్టర్ కంఠమనేని రవీంద్ర తెలిపారు. పాత పల్నాడు బస్టాండ్ సెంటర్‌లో హాస్పిటల్స్ ప్రారంభించి మొదటి ఏడాది పూర్తి చేసుకున్న శుభ సందర్భంగా శుక్రవారం హాస్పిటల్‌లో మీడియాతో మాట్లాడారు. తమను ఆదరించిన పల్నాడు, ప్రకాశం జిల్లా ప్రజలు, డాక్టర్లకు హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ప్రారంభించిన అనతి కాలంలోనే ప్రజల ఆదరాభిమానాలు పొందిందన్నారు. ఏడాది కాలంలోనే వ్యాధికి సంబంధించిన సర్జరీలు సుమారు 95 శాతం సక్సెస్ చేశామన్నారు. ఎండోస్కోపీ ద్వారా పిత్తవాహికలోని రాళ్లు తొలగించుట, కుట్లు ఆపరేషన్ లేకుండా చేయుట తమ ప్రత్యేకత అన్నారు. 24 గంటలు మానిటరింగ్ కలదన్నారు. హాస్పిటల్‌లో అత్యాధునిక లేబరేటరీ, ఫుల్ ఆటోమేటిక్ అండ్ సెమీ ఆటోమేటిక్ బయో కెమిస్ట్రీ ఎనలైజర్ కోయ గ్లోషన్, పచ్చ కామెర్లు, లివర్లో చీము చేరుట, లేబర్ వాపు, లివర్‌లో కొవ్వుచేరటం, పిత్తాశయంలో రాళ్లు తొలగింపు, ఎండోస్కోపీ క్యాన్సర్ గడ్డలకు చికిత్స చేస్తామన్నారు. పురుగుమందు సేవించటం, పాము, తేలు కాటు, ఎలుకులు మందు, ఆసిడ్ తాగిన కేసులకు చికిత్స చేయబడుతుందన్నారు. విషజ్వరాలు, మలేరియా, టైఫాయిడ్, డెంగ్యు, కోవిడ్ జబ్బులు చూస్తామన్నారు. షుగర్ సమస్యలు లేకుండా బీపీ, థైరాయిడ్‌కు చికిత్స చేయబడుతుందన్నారు. సమావేశంలో సాయి, నవీన్ పాల్గొన్నారు.

రూ.850 కోట్లతో నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి
- ములకలూరులో గడపగడపకు కార్యక్రమం



కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట రూరల్: నియోజకవర్గంలో సంక్షేమ, అభివృద్ధి పథకాల ద్వారా రూ.850 కోట్లు ప్రజలకు లబ్ధిచేకూర్చినట్టు ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. మండలంలోని ములకలూరు గ్రామంలో శుక్రవారం రాత్రి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను కరపత్రాలను అందజేసి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను అందజేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. గతంలో జన్మభూమి కమిటీల పేరుతో పేదప్రజలను వేధించారని గుర్తుచేశారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని 140 రోజులు గా నియోజకవర్గంలో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ములకలూరు గ్రామానికి 24 గంటల విద్యుత్ సరఫరా నిమిత్తం రూ.2.4 కోట్లతో ఆధునీకరిస్తున్నట్టు తెలిపారు. ఆసరా పథకం ద్వారా రూ.2కోట్లు మహిళల రుణాలను మాఫీ చేయడం జరిగిందన్నారు. గ్రామంలో 11.34 కోట్లతో సంక్షేమ పథకాలను అందించామని, రూ.3.9 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్టు తెలిపారు. స్కిల్ కుంభకోణంలో అరెస్ట్ అయిన చంద్రబాబు, ఆయన కుటుంబం సానుభూతి కోసం డ్రామాలాడుతున్నారని విమర్శించారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారని చంద్రబాబు చేసిన అవినీతి ప్రజలకు అర్థమయిందన్నారు. స్కిల్ కుంభకోణంలో 13 చోట్ల సంతకాలు చేసి చంద్రబాబు అడ్డంగా దొరికిపోయారన్నారు. ఎన్ని కుట్రలు చేసినా 2024 ఎన్నికల్లో తిరిగి సీఎంగా జగన్ విజయం సాధించడం ఖాయమని, నరసరావుపేటలో గోపిరెడ్డి హ్యాట్రిక్ సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం గోపిరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా వికలాంగులకు ట్రైసైకిల్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పదముత్తం చిట్టిబాబు, ఎంపీపీ మూరబోయిన శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ తన్నీరు శ్రీనివాసరావు, గ్రామసర్పంచ్ జె.ఏసుదయ, ఆవుల అర్జునరావు, షేక్ గస్, చింతా రాంబాబు, నూనె లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు గ్రామాల్లో బంగారుతల్లి కార్యక్రమం



నాదెండ్ల ఎస్సీ కాలనీలో రక్తహీనత నివారణపై అవగాహన కల్పిస్తున్న అధికారులు, నాయకులు

రొంపిచర్ల: మండలంలో పరగటిచర్ల గ్రామంలో శుక్రవారం బంగారు తల్లి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో ఎం.శేషిరెడ్డి పాల్గొని ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన బంగారు తల్లి పై గ్రామస్థులకు అవగాహన కలిగించారు. అదే విధంగా బంగారు తల్లి ప్రోగ్రస్ కార్డుపై ఆవశ్యకత గురించి తల్లులకు, విద్యార్థినీలకు వివరించారు. వారిచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు జి.అంకారావు, రెవెన్యూ అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది, తల్లిదండ్రులు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బొల్లాపల్లిలో...

బొల్లాపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బంగారుతల్లి కార్యక్రమంపై తహసీల్దార్, ఎంపీడీవో, ఐసీడీఎస్, వైద్యారోగ్యశాఖ అధికారులతో మండల ప్రత్యేక అధికారి ఎస్. ఓబులనాయుడు శుక్రవారం సమీక్ష నిర్వహించారు. బాలికల్లో రక్తహీనత నివారణ కోసం చేపట్టిన జాగ్రత్తల గురించి అధికారుల నుంచి సమాచారం సేకరించారు. ఈ పథకంలో 10-19 ఏళ్ల బాలికలకు ప్రతి 3 నెలలకోసారి రక్త పరీక్షల నమూనా సేకరించి వారిలో రక్తహీనత ఉన్నట్లయితే చేపట్టాల్సిన నివారణా చర్యల గురించి సమీక్ష నిర్వహించారు. ఈ ఏడాది ఏప్రియల్, జూలై మాసాల్లో పాఠశా కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్.దుర్గేశ్వరరావు, జి. శ్రీహరి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు వి. శ్రీదేవి, షేక్ మస్తాన్‌బీ, ఆర్. పద్మజారాణి, వైద్యారోగ్యశాఖ సిబ్బంది, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శావల్యాపురం ఎస్సీ కాలనీలో...

శావల్యాపురం: బాలిక విద్య ద్వారా సమాజ అభివృద్ధి సాధ్యమని ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రం శావల్యాపురంలో ఎస్సీ కాలనీలో కిషోరు బాలికల తల్లి దండ్రులకు బంగారు తల్లి హిమోగ్లోబిన్ ప్రోగ్రాస్ కార్డు కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో సర్పంచ్ యాగసిరి చెన్నమ్మ, తహసీల్దారు షేక్ జాన్‌సైదులు, ఎంఈవో మద్దికుంట సాంబశివరావు, జడ్పీ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయురాలు భువనేశ్వరీ, మండల కోఆప్షన్ సభ్యులు దూదెకుల హుస్సేన్, వైఎస్సార్ సీపీ నాయకులు చిట్టేటి రవి, ఏసురాజు, పంచాయతీ కార్యదర్శి మహేంద్ర, ఆరోగ్య కార్యకర్త ఇంకోల్లు నాగలక్ష్మి, కార్యకర్తలు పాల్గొన్నారు.

రక్తహీనత లేకుండా చూసుకోండి

నాదెండ్ల: పద్దెనిమిదేళ్ల లోపు ఆడపిల్లలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండేందుకు రక్తహీనత లేకుండా చూసుకోవాలని ఎంపీపీ తలతోటి రాణి చెప్పారు. మండల కేంద్రమైన నాదెండ్ల ఎస్సీ కాలనీలో శుక్రవారం మండల ప్రత్యేకాధికారి బీజే బెన్ని, ఎంపీడీవో షేక్ జాకీర్‌హుస్సేన్, తహసీల్దార్ ఎన్ నాగమల్లేశ్వరరావు, ఎంఈవో ఆంజనేయులు, కార్యదర్శి మారుతిబాబుతో కలిసి పర్యటించారు.

రూ.6 కోట్లతో అమ్మవారి ఆలయ పునర్నిర్మాణం

- ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి
- బాలాలయంలో పూజలు



బాలాలయంలో ప్రతిష్ఠించనున్న అమ్మవారి విగ్రహం వద్ద ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట రూరల్: ఇస్సప్పాలెం మహంకాళి అమ్మవారి ఆలయాన్ని రూ.6 కోట్లతో పునర్నిస్తున్నట్టు ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా అమ్మవారి బాలాలయంలో శుక్రవారం పూజాధికాలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి పాల్గొని పూజలు జరిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆలయ పునర్నిర్మాణాన్ని పూర్తి రాతికట్టడంతో చేపడుతున్నట్టు తెలిపారు. సుమారు రూ.6 కోట్ల అంచనాలతో ముఖ్య ఆలయం, బహుమండపం నిర్మాణం చేయడం జరుగుతుందన్నారు. మొదటి విడత నిర్మాణాన్ని రూ.3.5 కోట్లతో త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు. ప్రభుత్వం నుంచి ఇప్పటికే రూ.కోటి మంజూరు చేసినట్టు వివరించారు. విరాళాలు రూపంలో రూ.60 లక్షలు దాతలు ఇచ్చారని తెలిపారు. కామన్ గుడ్ ఫండ్ ద్వారా ప్రభుత్వం నుంచి మరిన్ని నిధులు సమకూరుస్తామన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో టి.సుధాకర రెడ్డి, మాజీ ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ జల్లి శ్రీనివాసరావు, రాధారపు శ్రీనివాసరావు, కొండపల్లి చినకోటయ్య, గుండాల శ్రీనివాసరావు, కమిటీ మాజీ సభ్యుడు ఏలూరి ఆశోక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ విద్యుత్ పొదుపు పాటించాలి

- డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఏడుకొండలు
- గృహవాసులకు లైఫ్‌స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్‌పై అవగాహన



ఎన్విరాన్‌మెంట్‌పై పోస్టర్లను ప్రదర్శిస్తున్న విద్యుత్‌శాఖ అధికారులు, గృహవాసులు

నరసరావుపేట: బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియన్సీ కలిగిన స్టార్ రేటింగ్ విద్యుత్ గృహోపకారణాలు వాడుతూ విద్యుత్ అవసరంలేని చోట లైట్లు ఆపు చేస్తే బిల్లు తగ్గి డబ్బు ఆదా అవుతుందని విద్యుత్ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వై.ఏడుకొండలు పేర్కొన్నారు. శుక్రవారం సత్తెనపల్లి రోడ్డులోని ఆదిత్య గృహ సముదాయంలో లైఫ్‌స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్‌పై గృహవాసులకు అవగహనా సదస్సు నిర్వహించారు.

విద్యుత్ పొదుపుపై అనేక సూచనలు చేశారు, ప్రతి ఒక్కరూ విద్యుత్ టోల్ ఫ్రీ నెంబర్ 1912 గురించి తెలుసుకోవాలన్నారు. విద్యుత్‌శాఖ ఏఇ రఫీ మాట్లాడుతూ విద్యుత్ బిల్లు లు సకాలంలో చెల్లించటం అలవాటు చేసుకోవాలని, డిజిటల్ ద్వారానే ఆన్‌లైన్ పేమెంట్ చేయవచ్చునన్నారు. గృహ సముదాయం ప్రెసిడెంట్ సుబ్రమణ్యం మాట్లాడుతూ సదస్సు ద్వారా విద్యుత్ పొదుపు కార్యక్రమం ఈ రోజు నుంచే పాటిస్తామని పేర్కొన్నారు. గృహ వినియోగదారుడు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ స్టార్ రేటింగ్ కలిగిన ఫ్యాన్లు, ట్యూబ్ లైట్స్ ఇవ్వాలని కోరారు. తొలుత ప్రోగ్రాం కన్వీనర్ ఆర్. బంగారయ్య కరపత్రాలు పంపిణీ చేశారు, పాల్గొన్న వారిచేత ప్రతిజ్ఞ చేపించారు. ఇన్‌చార్జ్ అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్ బి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో సత్తా చూపిన క్రీడాకారులు

జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన ఉప్పు బసవరాణి




బాలికల జట్టును అభినందిస్తున్న శావల్యాపురం హైస్కూలు ఉపాధ్యాయులు

శావల్యాపురం: రాష్ట్ర, జాతీయస్థాయి జూనియర్ బాలికల బాల్‌బ్యాడ్మింటన్ క్రీడా పోటీల్లో బాలికలు తమ సత్తా చూపటం అభినందనీయమని శావల్యాపురం జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బోడ్డపాటి విజయలక్ష్మి అన్నారు. శుక్రవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల్లో ఎంపికైన బాలికల జట్టుతో అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి మాట్లాడుతూ బాలికలు విద్యతో పాటు క్రీడల్లో రాణించటం పలువురికి ఆదర్శమన్నారు. రాష్ట్రస్థాయిలో బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో ఏడు మంది బాలికలు పాల్గొన్న ఆకుమళ్ళ సమీరా, కె.కావ్య, ఉప్పు బసవరాణి, ముట్లూరి లూదియా, ఓర్సు స్రవంతి, వేముల దివ్య, టి.అంజన, పాఠశాల పూర్వ విద్యార్థి ముక్కపాటి లిఖిత (బీటెక్ స్టూడెంట్) మూడోవ స్థానం సాధించటం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈనెల 22 నుంచి 24వరకు చిత్తూరు జిల్లా నగరిలో జరిగిన 8వ రాష్ట్రస్థాయి పోటీల్లో మూడోవ స్థానం సాధించిన ఉప్పు బసవరాణి అత్యుత్తమ ప్రతిభ చూపటం వలన వచ్చే నెలలో జరిగే బీహార్ రాష్ట్రంలోని పాట్నాలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జట్టు తరుపున ఉప్పు బసవరాణి పాల్గొంటుందన్నారు. రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్‌కే రోజా చేతుల మీదగా రాష్ట్రస్థాయి పోటీల్లో ఎంపికైన బాలికలు స్టార్ ఆఫ్ ఆంధ్ర అవార్డు ప్రశంస పత్రాలతో పాటు కప్ అందుకున్నట్లు పాఠశాల పీడీ రాగుల రాధాకృష్ణమూర్తి తెలిపారు. చత్తీస్‌గడ్ రాష్ట్రం బీలాయ్‌లో జరిగిన జాతీయస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో సిల్వర్ మెడల్ సాధించిన వేముల దివ్యను పాఠశాల ఉపాధ్యాయులు అభినందిచారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పీడీ రాగుల రాధాకృష్ణమూర్తి, బెజవాడ నాగేశ్వరరావు, అబ్దుల్లా, భువనేశ్వరీ, విమల కుమారి, రవి, నిర్మల, హనుమారెడ్డి, కిరణ్మయి, కుమ్మరి శ్రీనివాసరావు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

చిత్రకళా పోటీలో నరసరావుపేట వాసికి బహుమతి



గర్నెపూడి కల్యాణ్‌కుమార్



తృతీయ బహుమతి పొందిన చిత్రం

నరసరావుపేట ఈస్ట్: తిరుపతిలోని వేమన విజ్ఞాన కేంద్రం, కళాక్షేత్ర సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన వేమన పద్య భావన చిత్ర కళా పోటీలలో పట్టణానికి చెందిన గర్నెపూడి కల్యాణ్ కుమార్‌కు తృతీయ బహుమతి లభించింది. వేమన పద్యానికి అనుగుణంగా చిత్రాన్ని రూపొందించటంతో బహుమతి లభించినట్టు కల్యాణ్ కుమార్ తెలిపారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఫైన్ ఆర్ట్స్ చదువుతున్న కల్యాణ్ వేమన పద్యం స్థాన బలిమిని తెలియచేసేలా చిత్రాన్ని తయారుచేశాడు. ఆయన తండ్రి దేవదానం చిత్ర కళాకారుడు. పట్టణానికి చెందిన చిత్రకళాకారులు కల్యాణ్‌ను అభినందించారు. ఈనెల 29న తిరుపతిలోని వేమన విజ్ఞాన కేంద్రంలో జరగనున్న కార్యక్రమంలో కల్యాణ్ బహుమతి అందుకోనున్నాడు.

ట్రాక్టర్ అదుపుతప్పి ఒకరు మృతి

ఈపూరు:ట్రాక్టర్ బోల్తా పడి వ్యక్తి మృతిచెందిన సంఘటన మండలంలోని ముప్పాళ్ల అద్దంకి బ్రాంచి కెనాల్ వద్ద శుక్రవారం జరిగింది. సేకరించిన వివరాల మేరకు పొనుగోటివారి పాలెం గ్రామానికి చెందిన గుంటుపల్లి రామాంజనేయులు (46) తన ట్రాక్టర్‌తో పొగాకు నారు తెచ్చేందుకు వెళ్తుండగా అద్దంకి బ్రాంచి కెనాల్‌పై అదుపు తప్పి కాలువలో పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. బంధువులు, స్థానికులు మృతదేహాన్ని ఒడ్డుకు వెలికితీశారు. మృతునికి భార్య, పిల్లలు ఉన్నారు. సంఘటనా ప్రాంతానికి పోలీసులు చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.